# మా ఇలవేల్పు



కొండముది సోదరులు

# మా ఇలవేల్పు

కొండముది సోదరులు

కొండముది ప్రచురణలు
ఏలూరు : ; విజయవాడ.

ఇందులో ప్రచురించిన—

"వర్గరహితమైనదే స్వర్గం" అన్నవ్యాసం ఆంధ్రప్రభ నుండి పునర్ముద్రితం ఆ వారపత్రిక విశిష్ట సంపాదకులు పొత్త వెంకటేశ్వరరావుగారికీ 'ఉన్నదంతా అదే' అన్న వ్యాసం విశాఖపట్న మాతృశ్రీ అధ్యయన పరిషత్ వారి ప్రసంగ సభలలో శ్రోతజన నివేదితం ఆ సభానిర్వాహకులు శ్రీ కేశవశర్మగారికీ, గుంటూరులో ఉషోదయ ప్రింటర్సు, వెల్‌కమ్ ప్రెస్ వారికి అమ్మ ఆశీస్సులు.... మా కృతజ్ఞతలు.

.... ప్రచురణ కర్తలు.

త ముది



# అర్పణ

అమ్మకు ఐదుగురు బిడ్డల సమష్టి అక్షరార్పణం-ఇది కొండముది సోదరుల సాహితీ సమర్పనం.

ఎన్నినాళ్ళుగానో, లోలోపల నివేదించుకుంటున్నాను అమ్మకు. అమ్మా! కొండముది సోదరుల హృదయాంతరాలలో కదిలి మెదిలే కల్పవల్లివి నీవు, వారివారి గృహసీమలలో శాంతి సుఖాలను వర్షించే ఇల వేల్పువు, బాలాది వృద్ధులను చేయిపట్టి నడిపించే చైతన్య జ్వాలవు. మా కలాలకు ఊపిరివి నీవు, మా భావాలకు పరిమళం నీవు, మా కామనకు స్వరూపిణివి నీవు, మేమందరం కలిసి అక్షర నీరాజనం నీకందించే అవకాశం ప్రసాదించు తల్లీ! అని' నా ప్రార్థనను ఇప్పటికి ఆమోదించింది. మా అమ్మ. తన అరవై యేళ్ళ పండుగనాడు, మా పంచ ప్రాణాలను అరిషడ్వర్గాలను ఈషణత్రయాలను, ఉపాధిని, యోగాన్ని, కర్మానుభవాన్ని, ఈరూపంగా స్వాధీనం చేసుకుంటున్నది. అంతరికంగా సంఘటిల్లిన ఒక మహానుభవానికి బాహిరరూపం ఇవ్వడానికి అనుమతిస్తున్నది.

కొండముది వంశవృక్షంలో మేమయిదుగురమూ ఈ తరం కొమ్మలం. మా పూర్వీకుల్లో కొందరు భోగులు, మరికొందరు రాజయోగులు, కొందరు భూమిసుతులు, మరికొంధరు కీర్తిసుతలు. కొందరు విద్యాధిషణులు, మరికొందరు సమాజసేవాభూషణులు, సంస్కారం వారి ఆత్మసంద పవిపేతన వారిఆస్థి. అటువంటివాడికి వారసులుగా మమ్ము సృష్టించి నందుకుఅమ్మకు సర్వాత్మనా నమస్కరిస్తున్నాం. మాకు పెద్దన్న

శ్రీరామకృష్ణ, మాలో ఆచార్యపీఠం అయినది. నేనూ హనుమంతరావూ, దత్తాత్రేయశర్మా, చలపతిరావూ, ఆయన హృదయ పీఠానికి నాలుగు సేవలా అమరిన నాలుగు ఆధారాలం. పీఠాధిష్ఠాన దేవత అనసూయ మాత సమయ దారిద్ర్యం కారణంగా, కొండంత తల్లికి కొండంత అక్షర పత్రిని దమర్పించుకో లేక పోతున్నాం మేము. ఆమె ధరిత్రి - క్షమా ధరిత్రి ఇందులో వున్న అల్పాక్షరాలనే అనల్పంగా ఆమె సంభావించు కొంటుంది. అనంతంగా మమల్ని ఆశీర్వదిస్తుంది. జయహో మాతాశ్రీ అనసూయా రాజరాజేశ్వరీ శ్రీ ?రాత్వరీ....

కొండముది శ్రీరామచంద్రమూర్తి

ఇందులో....

కొండముది రామకృష్ణమూర్తి
కొండముది శ్రీరామచంద్రమూర్తి
కొండముది హనుమంతరావు
కొండముది దత్తాత్రేయశర్మ
కొండముది వెంకట చలపతిరావు
వ్రాసిన వ్యాసాలూ, కవితలూ....

# వర్గరహితమైనదే స్వర్గం

కొండముది రామకృష్ణ

అమ్మనుచూసేందుకు రోజూ అనేకులు జిల్లెళ్ళమూడి వస్తుంటారు వీరిలో అనేకవిధాలయిన వాళ్ళుంటారు.

కొందరు ఏవేవో కోరికలతో వస్తారు. వారు అమ్మను దైవమనీ, అవతార వ్యక్తి అనీ నమ్ముతారు. అదే దృష్టితో అమ్మను అర్చించుకుంటారు. ఏవైద్యుడూ, ఏ మందూ నయం చేయలేని వ్యాధులు తగ్గిపోయాయంటారు. చిరకాలంగా పరిష్కారంకాని సమస్యలు చిటికెలో సమసి పోయాయంటారు.

ఇష్టకామ్యార్థ సిద్ధిని పొందిన వ్యక్తి కృతజ్ఞతాభావాన్ని ప్రకటిస్తే అమ్మ అంగీకరించదు. వాళ్ళకోరికలు తీరడమనేది కాకతాళీయం అంటుంది ఆ తరుణం వచ్చిందీ, ఆ పని జరిగిందీ అని చెపుతుంది. అందుకు తన అనుగ్రహం అంటూ ఏమీలేదని స్పష్టంగా వినిపిస్తుంది. జిల్లెళ్ళమూడి రాకపోయినా, తనను చూడకపోయినా ఆ శుభం జరిగే వుండేదనీ చెపుతూ ఎందుకయినా తరుణం రావాలి అని ఉద్ఘాటిస్తుంది.

అమ్మ దైవాన్నికూడా అంగీకరించదు. దైవం అంటూ ఒకమూర్తి ఎక్కడో ఉండి ఈ సృష్టిస్థితి లయాలను నడుపుతూ ఉంటాడనే భావం అమ్మదృష్టిలో హాస్యాస్పదమయింది.

మనకు అర్థంకాని అనంతమయిన శక్తియొక్క భిన్నత్వమే ఈ సృష్టి అని అమ్మ చెపుతుంది. ఈ శక్తి పదార్థంగాను, పదార్థం శక్తిగాను

పరిణామం చెందుతూ ఉంటుందనీ, ఏ పదార్థానికయినా రూపారంభమే కాని రూపనాశం లేదనీ అమ్మ ఉద్ఘాటిస్తున్నది. అమ్మ దృష్టిలో జగత్తు సత్యమయింది-ఆద్యంత రహితమయింది.

"మీరు దైవం జగత్తుకంటే వేరు అంటారు. నేను ఈ జగత్తే దైవం అంటాను, మలయమారుతాలు, కోయిల కూజితాలు, విరబూసిన పూల సరోవరాలే కాదు, పెంట, పేడ, చీము, నెత్తురు, అన్నీ కలిసిన ప్రకృతినే పరమేశ్వరుడు అనుకుంటున్నాను.''

నాలుగు చేతులూ, కాళ్ళతో వేరుగా ఎక్కడో దైవం లేడు. అన్నీ అయి వున్నాడు. గులాబీ పువ్వుగా, తమలపాకుగా, మంచంగా, కిటికీగా అన్నీ తానే అయి వున్నాడు.

మీరు శరీరం ఆత్మకాదు అంటారు- కాని శరీరము ఆత్మ కాకపోలేదు.

ఈ వాక్యం ఆధ్యాత్మిక సాహిత్యంలోనే అపూర్వమయిన సత్యం. అమ్మ దృష్టిలో అంతా చైతన్యమే జడమే లేదు. కనుపించేదంతా దైవ స్వరూపమే నన్న విషయాన్ని అమ్మ పలురీతుల్లో ఉద్ఘాటిస్తున్నది.

"జగన్మిథ్య బ్రహ్మ సత్యం'' అన్న పూర్వోక్తిని తిరగేసి "జగత్తు సత్యం" అని చెపుతూ జగత్తుకూ జగన్నాధునికీ అభేదాన్ని ప్రబోధిస్తున్నది.

అందువల్లనే 'జగన్మాత' అనే పదానికి వివరణ యిస్తూ "జగత్తే మాతకానీ జగత్తుకు మాతకాదు.' అని అపూర్వమయిన నిర్వచనాన్ని ప్రసాదించింది.

'ఆత్మసాక్షాత్కారం' అంటే సర్వమూ ఆత్మగా (అంటే దైవంగా) కనుపించడమట? అందువల్లనే అమ్మ—

"నేను దేనికోసమూ ఏదీ చేసింది లేదు. ఆరాధనకూడాప్రత్యేకంగా దైవ మొకదాంట్లో ఉన్నాడని ఆరాధించలేదు. మీ అందరినీఆరాధించడమూ మీ రందరూ దైవమను కోవడమే. ,,

సాధన చెయ్యాలనీ నాకు లేదు. చేసిందీ లేదు. నేను ఏనాడూపూజ చేసి ఎరగను. దీపారాధనకూడా చేసి ఎరగను." అని ఘంటా ప థ ం గా చెప్పింది.

విచిత్రమయిన విషయం ఏమిటంటే అమ్మను చూసేందుకు వచ్చే వాళ్ళలో అత్యధికులు అమ్మను పూజిస్తారు. అమ్మను ఎ వ రి ఇ ష్ట దై వ రూపంలో వారు భావిస్తారు.

అమ్మ మాత్రం "నేను దైవాన్ని కాదు. నేనూ మీలాంటి దా న్నే' సర్వసామాన్యవ్యక్తిని,, అంటుంది

"మరి, ఈపూజలు ఎందుకుఅంగీకరిస్తున్నారమ్మా? ' అవిప్రశ్నిస్తే'

"మీరుమాత్రం పూజలు నాకనిచేస్తున్నారా? ఏలక్ష్మిఅనో, పార్వతి' అనో, సరస్వతి అనో చేసుకుంటున్నారుకానీ" అని సమాధానంచెబుతుంది,

పూజల విషయంలో అమ్మ చెప్పే మరో కారణం ఉంది.

మనస్సుకు అత్యంత ఉన్నతమయిన స్థానాన్ని ఇస్తున్నది అమ్మ, శరీరమూ, మనస్సు యొక్క కలయిక మాత్రమే మనిషి అంటున్నది' ఆధ్యాత్మిక సంప్రదాయవాదులు చెప్పే జీవాత్మను అమ్మ చెప్పడం లేదు'

"దయలేని మనస్సులే దయ్యాలు,, అని ఒ క స ం ద ర్భ ం లో

చమత్కారంగా ప్రవచిస్తూ ,,అస్వతంత్ర మయిన మనస్సే మానవత్వం. స్వతంత్రమయిన మనస్సే దైవత్వం,, అని వివరించింది. ,,భిన్నత్వం లేని మనస్సే దైవత్వం,, అని మరోసారి ప్రకటించింది.

శుపూలు మనస్సుకు ఏకాగ్రతను కలిగించడం కోసమూ,పరిశుద్ధం చేయడంకోసమూ దోహదం కలిగిస్తాయని అమ్మ అభిప్రాయం.

అదృష్టితోనే పూజలను, ధ్యానాలను, జప తపాలను అమ్మ అంగీక రిస్తున్నది. అమ్మ ఒకసారి చెప్పింది తపస్సంటే ఒళ్ళుమరచిపోవడంకాదు. వచ్చే ఒడిదుడుకులను సమంగా అనుభవించడమేనని.

అమ్మ తన ప్రబోధాల్లో సమచిత్తానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నది. పరిపక్వమయిన మనసన్నా, పరిపూర్ణమయిన మనసన్నా అదే నని అమ్మ చెబుతున్నది. పరిపూర్ణమయిన మానవత్వమంటేకూడా అదేనని అమ్మ ప్రవచిస్తున్నది.

మానవతకు పరాకాష్ఠస్థితి కూడా 'సమ దర్శనమే' నని అమ్మ నిరంతర ప్రబోధం.

ఈ ప్రబోధం అమ్మ కేవలంవాక్కు ద్వారానే మనకు అందించడం లేదు. మనసా తానుఅదే శిఖరాగ్రస్థితిలో అధివసించి కర్మణా మనకు ఆదర్శంగా ప్రవర్తిస్తున్నది.

ఈ త్రికరణ శుద్ధి నేడు లోకంలో మృగ్యమై పోయింది. ఎక్కడ యినా అది కనబడితే చాలు లోకానికి అరాధ్యమై పోతున్నది.

''నేను ఏమి చెప్పినా నా అనుభవంతోనే చెబుతాను'' అంటుంది అమ్మ.

అమ్మ అనుభవం అపారమయినదిగానూ, అమ్మ జ్ఞానం అనంతం గానూ, అగాధంగానూ కనుపిస్తుంది.

అందువల్ల నే అనేకులు జిజ్ఞాసువులు అమ్మను దర్శిస్తారు.

మామూలుగా అమ్మ ప్రాథమిక పాఠశాలకు కూడా వెళ్ళలేదు. ఏమీ చదువుకోలేదు. గ్రంథ పరిచయం లేదు. ఏ శాస్త్రవాసనా లేదు.

అందు వల్లనే అమ్మ ఏ విషయం మాట్లాడుతున్నా ఏ శాస్త్రాల్లో నుంచీ ఏ ప్రమాణ వాక్యాలనూ ఉదహరించదు. తన అనుభవమే తనకు ప్రమాణం. అనుభవం శాస్త్రాన్నిస్తుందికానీ. శాస్త్రం అనుభవానివ్వదు కదా!

అమ్మకు గురువుకూడా ఎవరూలేరు. ఎవరికయినా వాళ్ళ మనసే వాళ్ళకు అసలైనా గురువు అని అమ్మ ప్రవచనం. పరిస్థితులు బోధించి నట్లుగా, మరెవరూ బోధించలేరని అమ్మ పదే పదే చెబుతున్నది.

అందు వల్లనే అమ్మకు లోకమే పాఠశాలట తన అనుభవమే శాస్త్ర మట.

కనకనే అమ్మ ఎం చెప్పినా, ఎప్పుడు చెప్పినా ఆ వాక్యాలు కొత్త కాంతులతో, సహజమయిన సౌందర్యంతో అలరారుతుంటాయి. అవి ఎంతో పరిపుష్టంగానూ, రిమళ భరితంగానూ ఉంటాయి అవి గుండెలోయల్లోంచి ప్రభవిస్తాయి కనక మన గుండెలను స్పృశించ గలుగుతాయి.

అమ్మ మాటల మేలుకొలుపులు మనకు కొంగ్రొత్త పాఠాలను బోధిస్తాయి. మనకు కొత్త దారిన నడిపిస్తాయి, అది పూలబాట, పాలపుంత కాకపోవచ్చును. కాని ఆ మార్గం విలక్షణమైనదే. వినూత్నమైనదే.

అమ్మ అనుభవసారం ఈ కనిపించేదంతా దైవమేనని, దైవం కానిదేదీ లేదని ఎంత వెదికినా నాకు అది కానిది, కనుపించడంలేదు. అని అమ్మ ఘంటాపథంగా చెప్పింది.

అందువల్ల నే

అమ్మ దృష్టిలో అసత్తులేదు. జడంలేదు.

అన్నం పరబ్రహ్మ స్వరూపమయితే మరి, అసుద్ధమో? అని అమ్మ ప్రశ్నిస్తే, వినగానే మనకు విడ్డూరంగా ఉంటుంది. కాని గోమయాన్ని తీసుకవచ్చి గొబ్బిమ్మను తయారు చేసి గౌరీదేవిగా మనం అర్చించటాన్ని జ్ఞాపకం చేస్తే మనం విస్తుపోతాము

అట్లాగే ప్రజ్ఞానం బ్రహ్మ అయితే. అజ్ఞానం సంగతి ఏమిటి? అని అడుగుతుంది అమ్మ.

ఆనందో బ్రహ్మ అన్న వాక్యాన్ని "బాధ భగవంతుడే" నని పరిపూర్ణం చేస్తుంది.

తేజస్సే కాదు తిమిరమూ దైవమేనట !

"మాతృదేవోభవ", "పితృదేవోభవ" అని ఉపనిషత్తులు ఉద్ఘోషిస్తుంటే, అమ్మ తల్లిదండ్రులకు పిల్లలూ అర్చా స్వరూపులే నని కొత్త సందేశం ఇస్తున్నది.

మరి, గురువుకు శిష్యుడూ భగవంతుడేనట !

వైద్యునికి రోగులూ దైవ స్వరూపులేనట !

అమ్మ వైద్యులకు సలహా యిచ్చింది— 'రోగిపై జాలితో కాదు, నాన్నా! భక్తితో సేవించూ' అని. భగవంతుడు తనను సేవించుకోవడానికి వైద్యులకు అనుగ్రహించిన ఒక అవకాశం రోగి!

భర్త భార్యకు దేవుడట! భార్య భర్తకు దేవతట!

త్యాగరాజు కీర్తనలో 'చీమలో, దోమలో' అని వింటూ "చీమగా-దోమగా" అని సవరించింది.

అమ్మ దృష్టిలో దైవం సర్వాంతర్యామి కాదు. దైవం సర్వరూపుడు.

నిరాకారుడు అంటే అన్ని ఆకారాలూ అయిన వాడట! నిర్గుణుడు అంటే అన్ని గుణములూ కలవాడట!

ఈ సృష్టి సర్వమూ దైవస్వరూపమే కనుక అంతా అర్చనీయమేనని అమ్మ భావన. అర్చించడమంటే ప్రేమించడమేనట!

సామాన్యంగా మన అధ్యాత్మిక సిద్ధాంతాలు ఈ లోకమూ, సంసారమూ, మమకారాలూ బంధహేతువులనీ, ఇవన్నీ త్యజించాలని కనీసం వీటికి దూరంగానయినా ఉండాలనీ హెచ్చరిస్తుంటే, అమ్మ మరో మార్గాన్ని ఉపదేశిస్తున్నది.

ఈ లోకంకాక లోకేశుడంటూ వేరే లేడు కనుక లోకాన్నిఆరాధించమంటున్నది. లోకంలోని ప్రత్యణువునూ ప్రేమించమంటున్నది.

సంసారమంటే భర్తా, భార్యా, బిడ్డలూ కారట. సంసారమంటే సంకల్పమట! సంకల్ప రాహిత్య మనేది గగన కుసుమం. సంకల్ప రాహిత్యానికి అమ్మ ఒక క్రొత్త నిర్వచనం ఇచ్చింది. మనకు వచ్చే సంకల్పం

మనదికాదు. ఈ జగత్తు సంతనూ నడిపే ఒక మహాశక్తి ననుసరించిన స్పందన మాత్రమేనని తెలుసుకోవడమట?

ఇక, ఈ 'మమకారం, విషయానికి వస్తే ఇదొక మహత్తరమయిన మార్గం. అమ్మ కూడా చెప్పింది. "సౌఖ్యానికి దారిగా కనబడుతూ దుఃఖాన్ని కలిగిస్తుంది. 'నాది' అనేది" అని.

అయితే ఈ మమకారమే మానవుణ్ణి మాధవుణ్ణిగా రూపొందించగల అమృతమూ, దివ్యసాధనమూ.

పరిమితమయిన మమకారం మానవత్వమూ. దుఃఖభాజనమూ. కానీ పరిమితులూ పరిధులూ దాటి అపరిమితమూ, అపరిచ్ఛిన్నమూ అయినప్పుడు అదే దివ్యత్వం?

"మన బిడ్డలయందు ఏమేం చూస్తున్నామో, అందరియందు దానిని చూడటమే బ్రహ్మస్థితిని పొందడం''

"నీ బిడ్డ బాధను చూసి నీవెట్లా దుఃఖపడతావో,అందరి బాధల్లోనూ నీ దుఃఖం నివారణ అవుతుంది.''

ఇది విశ్వజనీన ప్రేమ. ఇది సర్వభూతానురాగం ఇది నిజమయిన మమకారం. స్వపర భేద మెరుగని నిస్సీమ స్థితి అయిన వాళ్ళు, కాని వాళ్ళు అంటూ తెలియని అత్యద్భుత అద్వైత పరాకాష్ఠ

అందుకనే అమ్మ సృష్టిని గురించి వివరిస్తూ "సృష్టి అనాది, నాది" అని చెప్పింది.

ఇది అపూర్వమయిన భావన. అపారమయిన అమ్మ హృదయానికి దర్పణమనదగిన ప్రకటన ఇంతవరకు చరిత్రలో 'ఈ ఊరు నాది'

'ఈ రాష్ట్రం నాది', 'ఈ దేశం నాది, అన్న వాళ్లున్నారే గానీ, 'ఈ సృష్టి నాది' అన్న మహా మహితాత్ములు జగచ్చరిత్రలోనే కనుపించరు.

ఆపాత మధురమయిన ఈమమకారంతోనే అమ్మ మనల నందరినీ ప్రేమిస్తున్నది, నేను అమ్మను, మీరుబిడ్డలు అంటున్నది. ఎవరిని చూసినా నాకు నా బిడ్డే అనిపిస్తుంది అంటున్నది. మిమ్మల్నందరినీ నే నే కన్నాను మీ మీ తల్లులకు పెంపుడిచ్చా ననిపిస్తుంది. అని అందరినీ అనురాగమృత పారావారంలో ముంచెత్తుతున్నది.

అలౌకికమయిన, అసాధారణమయిన, అతి మానవమయిన ఈ వాత్సల్యంవల్లనే ఎందరో అమ్మవద్దకు ఆకర్షితులవుతున్నారు.

అక్కడొక ఆశ్రమం ఏర్పడింది. అమ్మ ,అందరిల్లు, అని నామకరణం చేసింది. ఈ పేరు లోనే కాదు, ఆశ్రమ నిర్వాహణలో ఏఅంశంలో చూసినా అమ్మ విశ్వజననీ విశాల హృదయ పరి స్పందనలో ఉత్పన్నమయ్యే విమలానురాగ మధుర సంగీతమే మనలను వివశులను చేస్తుంది.

అక్కడొక అన్నపూర్ణాలయం,

ఎప్పుడు వచ్చినా, ఎందరు వచ్చినా ఇక్కడ ఉచితంగా భోజనం పెట్టబడుతుంది. ఇక్కడ అన్నం పెట్టటానికి ఆకలి మాత్రమే అర్హత। వాడి ద్రస్సునూ, అద్రస్సునూబట్టికాదు. ఎవరయినాసరే, జిల్లెళ్ళమూడికి ఆకలితో రావచ్చునుగాని, ఆకలితో .వెళ్ళగూడదట. అమ్మ ఆ క లి కి అత్యంత ప్రాధాన్య మిస్తున్నది. అక్కడరోజూ వేయిమందికి పైగా భోజనం చేస్తారు. అందరూ ఒకే పంక్తిన కూర్చుంటారు. కుల, మత, జాతి భేదం లేదు. పేద. ధనిక వ్యత్యాసం లేదు, దుర్జనుడని విభజన లేదు. ఈ నిరతాన్న దానాన్ని "దానం" అనడానికి అమ్మ అంగీకరించదు. తల్లి బిడ్డలకు అన్నం పెట్టుకోవడమేనంటుంది.

అమ్మకు అందరూ సమానమే.

వర్గరహిత సమాజానికి అదొక చిహ్నరూపం.

'వర్గరహితమైనదే స్వర్గం' అన్నది అమ్మ.

సంస్కృత పాఠశాల ఉన్నది. కళాశాల వున్నది. విద్యార్థులందరికి ఉచిత భోజన వసతి సౌకర్యాలున్నవి. అవి కేవలం విద్యాలయాలే కాదు సత్పౌరులకూ, ఉత్తమ మానవులకూ రూపకల్పనచేసే ఆదర్శ సంస్థలు.

ఉచిత వైద్యాలయం ఉన్నది.

ఆదరణాలయం ఉన్నది. వృద్ధులకూ, వికలాంగులకూ, అనాధలకూ ఆశ్రయ మిస్తున్నది.

"అనాథ" లెవరూ లేరు. అందరూ 'శ్రీనాధు' లే నంటున్నది అమ్మ.

అదొక అద్భుతమైన ఆశ్రమం. ఎన్నో జగద్ధిత కార్యక్రమాలతో, మతోద్ధరణకు కాక మానవోద్ధరణకు సహాయంచేసే ప్రబోధాలతో అలరారు తుంటు-ది. అమ్మ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పదు. ఉపన్యాసాలివ్వదు. ఉపదేశాలు చేయదు. మహిమలు ప్రకటించదు. మంత్ర ప్రభావం చేయదు. మంత్రమంటూ శక్తిమంతమయిన ప్రత్యేక అక్షరాలు ఏవీ లేవంటుంది. మనస్సిద్ధివుంటే అన్ని అక్షరాలూ మంత్రాలేనంటుంది.

అమ్మ మనను ప్రేమిస్తూ ప్రేమించటం మనకు నేర్పుతున్నది. ప్రతిఫలాపేక్ష రహితమైన నిర్మల ప్రేమయొక్క విరాట్ స్వరూపాన్ని మనం జిల్లెళ్ళమూడిలో చూడగలుతాం.

అమ్మ అనుసరిస్తున్న విధానం ఈ నాటి జకత్తుకే ఆదర్శమయింది అమ్మ ప్రబోధిస్తున్న "సర్వత్రానురాగం" ఈ కాలానికి ఎంతో అవసర మయింది.

భరించలేనిదే బాధ
సహించలేనిదే హింస
ఇష్టం లేనిదే కష్టం
వర్గం లేనిదే స్వర్గం
వైకల్యం లేనిదే కైవల్యం
అనుకున్నది జరగదు
మనకున్నది తప్పదు
అప్పులు, తప్పులు ఎవరికైనా తప్పవు,
తల్లికి తప్పే అనుపించదు
పంచిపెట్టని కాడికి ఉండడం దేనికి !
తృప్తే ముక్తి

—అన్న అపూర్వమయిన నిర్వచనాలతో, ప్రవచనాలతో అమ్మ అనుదినం అసంఖ్యాకులకు క్రొత్తపాఠాలు గరుపుతుంటుంది,

# తాదాత్మ్యం

కొండముది రామకృష్ణ

అమ్మా —

అసలు ఎవరునీవు?
నీ వెక్కడుంటావు?
నీకూ నాకూ సంబంధ ఏమిటి?
ఎందుకిట్లా నా వెంటబడ్డావు?
పగలూ రాత్రీ
కష్టంలో సుఖంలో
నాతో బాటే నీకేం పని?
నాతో నీకేం అవసరం?
నా జీవితాన్ని హెచ్చించనీ, భాగించనీ
నా కష్టసుఖాలు పంచుకోనీ....
నాకు నా వాళ్ళున్నారు
నన్ను కన్న వాళ్ళున్నారు
నేను కన్న వాళ్ళున్నారు
కట్టుకున్న వాళ్ళున్నారు
చేతులు
కలుపుకున్న వాళ్ళున్నారు
సన్నిహితు లున్నారు
స్నేహితు లున్నారు
వీళ్ళలో నీ వెవ్వరు?
వీళ్ళలో నీ వెవరివీ కావే!

వీళ్ళందరినీ ఎవరోలా అనిపింపజేస్తున్న
నీవెవరు ! నీ వివరాలేమిటి !
నీకూ నాకూ సంబంధ మేమిటి !
నీకూ నాకూ బంధమెక్కడ !

చీకటిలో దారి కనుపించక తడువుకునే వేళ
నీవే కరదీపికవై ముందు నడుస్తావు
దారుల కూడలిలో అసలు దారి తెలియక
తికమక పడుతున్న తరుణాన
నీవే దిక్సూచివై మార్గ ప్రబోధం చేస్తావు

దారిలో కాలుజారి నేలకరచిన సమయాన
నీవే చేయి అందించి పైకి లేవనెత్తుతావు
కల్లోలిత సాగరంలో కలవరపడిపోతున్నప్పుడు
నీవే నావవై దరిజేరుస్తావు
జడివానలో తడిసిపోతున్నప్పుడు
నీవే గొడుగువై ఆదుకుంటావు
నిప్పులు చెరిగే ఎండలో
వేడిమికి ఎముకలే కరిగిపోయేటప్పుడు
నీవే తరుచ్ఛాయవై ఆశ్రయ మిస్తావు

నరాలు కొరికే చలిలో గజగజ వణికేటప్పుడు
నీవే దుప్పటివై వెచ్చదన మందిస్తావు
ఆకలికి అలమటించే వేళ
నీవే అన్నమై ఆదరిస్తావు
నిద్రపట్టక నిరసించే వేళ
నీవే జోలవై చిచ్చికొడతావు
కలతజెందిన మనస్సులో కన్నీరు కారుస్తుంటే
నివే ఆశవై కన్నిరు తుడిచి ఓదారుస్తావు

మనస్సు భయవిహ్వలమై
    శరీరం స్వేదసిక్త మయినప్పుడు
    నివే వెన్ను తట్టి ధైర్యమిస్తావు
అమ్మా—
నాపైని కెందు కీ సానుభూతి?
నాపైని కెందు కీ అనురాగం?
నీ యీ కరుణకు కారణ మేమిటి?
నీ యీ మమతకు మూల మేమిటి?
    ని వెవ్వరు? నే నెవ్వరు?
    నికూ నాకూ బంధ మెక్కడ?
        అను బంధ మేమిటి?
నేను ఆటల్లో విజేతనైతే
నీ మెడలో పూలదండలు వేసినట్లు
    కేరింతలు కొడతా వేమిటి?
నా మనస్సులో అనందం తరింగిత మయితే
    నీ కన్నుల్లో ఆనందాశ్రువులు పొరలుతా యేమిటి?
నేను కడుపునిండా భుజిస్తే
    నీవు త్రేన్చుతా వేమిటి?
నాకు హాయిగా నిద్రపడితే
    నీవు గుఱ్ఱు పెడతా వెందుకు?
నేను పద్యం వ్రాస్తే
    పదంపదంలో ని వెందుకు ప్రత్యక్ష మవుతావు?
నేను పాట పాడితే

వీకు నిరుపమాన ఆనంద పారవస,ం
    ని వెంధుకు రాగి తాళాలు మేళ విస్తావు?

నా సంతాపంలో నికు కన్నిటి మిలమిల?
నా సంతోషంలో నికు నవ్వుల గలగల?
నేను ఆకాశానికి ఎగిరితే
నేను పాతాళానికి క్రుంగితే
        నీకు ఎనలేని బాధా, ఏమిటీ రహశ్యం?

అమ్మా—

        ఎవరివినీవు?

నికూ నాకూ ఏమిటి సంబంధం?
నా జీవితంతో నీ కీ ముడిఏమిటి?

    ఎవరినీ వద్దనుకుని పారిపోతున్న
    నావెంజ నీవెందుకు పరుగెత్తుతావు ?

ఎవరివి నీవు ?
    నా నీడవా ?

నీడకు చైతన్యముండదు
నీడ వెలుగివ్వదు
నీడ ఎలుగెత్తదు
మరి నీవో—
మహోజ్వలంగా భాసిస్తున్నావు
మాట్లాడుతున్నావు
మమత కురిపిస్తున్నావు

ఎవరు నీవు ?

ఎందుకు నన్నిలా వెంబడిస్తున్నావు ?

నా బ్రతుకు నన్ను బ్రతకనీ__
నా జయాపజయాలు నన్ను అనుభవించనీ__
నా ఏడుపును నన్ను ఏడవనీ__
నా నవ్వును నిన్ను నవ్వనీ__
నీవెందుకు నా సరసన ?
నీకెందుకు నాతో సరసం ?
నాదారిన నన్ను __నడవనీ

నికు నిరుపమాన ఆనంద పారవశ్యం?
నన్ను నన్నుగా ఉండని_

హద్దులు దాటి ని వెందుకు ముందుకు వస్తావు?
ఈ ఆక్రమణకు వి కధికారం ఎవరిచ్చారు?

నా బ్రతుకును నన్ను బ్రతకని
నా ఆలోచన నన్ను చేసుకోని__

నా జీవితంపై వి ప్రభావ మేమిటి?
నా జీవితాకాశంలో ని ప్రకాశ మెందుకు!
నా మనస్సు ని సామ్రాజ్యమా!
నా హృదయంలో వి సింహాసన మేమిటి?

నా రక్తంలో ని వెందుకు?
నా తత్వంలో ని వెందుకు?

నా కండలో ని వెదుకు
నా కండగా ని వెందుకు?
నా గుండెలో ని వెందుకు?
నా గొంతులో ని వెందుకు?
నా ప్రతి కదలికలో ఎందుకు ని కీ జోక్యం?
నా జీవితంలో ఎందుకు ని నిరంతర ప్రమేయం?
నా బ్రతుకును నన్ను బ్రతుకని
నన్ను నన్నుగా ఉండని
నీ వెందుకు నీలో అహర్నిశం!
నీ కెందుకు నాతో అనుక్షణం?
నీ వెవ్వరు? నే నెవ్వరు?
నీకూ నాకూ బంధ మేమిటి!
నీకూ నాకూ యీ అను బంధ మెందుకు?

—:O:—

# "ఉన్నదంతా అదే!"

కొండముూది హనుమంతరావు

"అమ్మా! రామకృష్ణపరమహంస వివేకానందస్వామికి భగవంతుడ్ని చూపించారుట కదా! మీరూ నాకు చూపించకూడదు?" అని ఒక సోదరుడు అమ్మను అడిగాడుట.

దానికి అమ్మ సమాధాన మేమిటో గమనించారా!

"కనపడేదంతా వాడే అయినప్పుడు దేనినని ప్రత్యేకంగా వేలుపెట్టి చూపించమంటావు-నాన్నా!" ఇదీ అమ్మ సమాధానం.

భగవత్ సాక్షాత్కారం కోరిన భక్తుడికి, సత్యదర్శనం కోసంతపించే అన్వేషికి ఇంతకన్నా కావల్సిన సమాధానం మరేమి ఉంటుంది? అమ్మ ఇచ్చిన ఈ సమాధానంలో ఎంతో సౌలభ్యం ఉంది. కనపడేదంతా దైవమే అన్నది.

మీకు చీమ కనిపిస్తున్నది: దోమ కనిపిస్తున్నది. బల్లా, కుర్చీ కని పిస్తున్నాయి. వాటిలో దైవం ఉంది, దానికోసం వెతుక్కోండి - అని మనను ఇబ్బంది పెట్టటంలేదు అమ్మ. అరటిపండు చేతికి ఇచ్చి, వలచు కుని తినమనలేదు. అరటిపండు తనే వలిచి, మన చేతిలో పెట్టి తిన మన్నది. చీమలో, దోమలో కాదు. బల్లలోకాదు: చీమనే, దోమనే, బల్లనే, కుర్చీనే దైవంగా చూడమన్నది. ఇది చాలా సులభంగదా!

ఒక సోదరి - "మీరు మాలో దైవాన్ని చూస్తారమ్మా!" అని అంటే "మీలో కాదు-మీరుగా చూస్తాను" అని సవరణ చేసింది అమ్మ.

"మీ రంతా నేనే, మీదంతా నేనే" అని వివరించింది అమ్మ ఈ సర్వమూ "నేను నేనైన నేను" అంటూ సర్వాత్మభావం ప్రకటించింది అమ్మ.

ఇంతవరకు ఏ ఆచార్యులా, ఏ ప్రవక్తా, ఇంత తేటతెల్లంగా చెప్ప లేదేమో! దైవాన్ని ఇలా అంతటా చూడమని సూచించలేదేమో! అందు కనే సోదరులు డాక్టర్ శ్రీపాద ఇది అమ్మ సూచించే కొత్తదారి అన్నారు.

అవును—వైవమంటే ఏమిటో అమ్మ కొత్తపద్ధతిలో చెప్పింది.

సంప్రదాయ వేదాంతులు "తత్ సత్" అన్నారు. సత్యమూ, నిత్యమూ అయిన పదార్థం ఇది కాదు; మన కళ్ళముందు కన్పించే చీమా, దోమా, బల్లా, కుర్చీ అనిత్యం, కాబట్టి ఇదంతా సత్యంకాదు అన్నారు. కాని అమ్మ బల్లా, కుర్చీ, చీమా, దోమా అనిత్యం కాదు, నిత్యమే అంటుంది. రూపాం తరమే కాని, రూపనాశనం లేదు అంటుంది అమ్మ.

బల్ల విరిగిపోతే కుర్చీ చేయవచ్చు, కుర్చీను చెడగొట్టి బల్లా చేయ వచ్చు. ఇది రూపాంతమే కాని, రూపనాశనం కాదు కదా! చీమా దోమా చనిపోతే పంచభూతాల్లో కలిసిపోతాయి కాని, నాశనంకావు. అందుకే అమ్మ మరణమంటే పరిణామం" అన్నది.

అమ్మ చెప్పే ఈ సత్యం శాస్త్రబద్ధం, విశ్వజనీనం.

విజ్ఞాన శాస్త్రంలోని శక్తి నిత్యత్వ సిద్ధాంతం—శక్తిని సృష్టించ లేము, నాశనమూ చేయలేము. కాని ఒక రూపంలో ఉన్న శక్తిని మరొక రూపంలోకి మార్చవచ్చును - అని చెప్తుంది. స్విచ్ వేస్తే విద్యుద్దీపం వెలిగి, కాంతి నిస్తుంది. అంతమాత్రాన కాంతిని సృష్టించామని కాదు. విద్యుచ్ఛక్తి, కాంతిశక్తిగా మారింది. ఆలాగే డైనమోలో యాంత్రికశక్తి

విద్యుచ్ఛ క్తిగా మారితే, మోటారులో విద్యుచ్ఛ క్తి యాంత్రిక శ క్తిగా మారుతున్నది. ఇలా ఎన్నైనా ఉదాహరణలు చెప్పుకుంటూ పోవచ్చు.

ఈ నిత్యత్వసిద్దాంతం శ క్తికేకాదు; పదార్థానికీ వ ర్తిస్తుంది. ఆ మాటకు వస్తే పదార్థమూ - శ క్తీ వేరుకాదు. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్ స్టీన్ ప్రవచించిన ద్రవ్య, శ క్తి తులత్యతా నియమం ప్రకారం పదార్థమూ శ క్తీ ఒకటే.అటంబాంబు హైడ్రోజన్ బాంబులలో పదార్థం శ క్తిగా మారి విడుదలవుతుంది, విశ్వకిరణాల జల్లులో శ క్తి ద్రవ్యకణాలుగా పరిణామం చెందుతుంది;

కాబట్టి శాస్త్రీయ దృష్టితో చూస్తే జగత్తులోని పదార్థమూ, శక్తీ సర్వము నిత్య మేకాని నశ్వరంకాదు. అమ్మ చెప్పేదీఅదే!జగత్తు మార్పుచెం దుతున్న దే కాని,నాశనం కావటంలెదు. అందుకనె మారుతూఉందే ఈ జగ త్తే నిత్యమన్న ది. గాలీ, నీరూ, బల్లా, కుర్చీ, నీవు, నేను, మొదలైన వివి ధరూపాల్ ఈజగత్తు. ఇదెసత్యం. నిత్యము, సత్యము అయినది ఇదేకాని ఇదే కాని మరొకటి కాదుఅన్న ది. ఇదంతా అదే ! ఎప్పుడున్న దై నా అంతా తానే అయిన ఒకటి అన్న ది సిసలై న అద్వైతమూ ర్తి అమ్మ.

ఎప్పుడున్న దై నా ఆ ఒకటే, అదే అనటంలో అది ఈ నాటిదికాదు అన్న ధ్వని ఉంది. ఆ భావంలోనే "సృష్టి అనాది" అన్న ది అమ్మ. అంతే కాదు, సృష్టికి ఆద్యంతాలు లేవు-అనీ చెప్పింది అమ్మ.

ఇలా అమ్మ సృష్టిని గురించి చెప్పిన మాటలకూ, ఆధునిక విజ్ఞాన శాస్త్రం విశ్వసృష్టిగురించి వచ్చిన అవగాహనకూ ఎంతో అన్వయం కుదురు తున్న ది.

అయితే విశ్వసృష్టిని గురించి విజ్ఞానశాస్త్రపు అవగాహన ఏమిటి ?

మనం నివసిస్తున్న ఈ భూగోళం ఒక గ్రహం. తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ పరిభ్రమిస్తు న్నది. ఇట్టి గ్రహాలు ఇంకా 8

ఉన్నాయి. ఇకేకాక 50 ఉపగ్రహాలూ ఉన్నాయి. గ్రహం చుట్టూ తిరిగే. దానిని ఉపగ్రహం అంటారు. చందమామ ఒక ఉపగ్రహమే. ఇలాగ గ్రహాలు, ఉప గ్రహాలు కాక సూర్యుని చుట్టూ తిరిగే గ్రహశకలాలు కొన్ని వేలు ఉన్నాయి. అంతేకాక తోకచుక్కలు కొన్నివందలున్నాయి. ఇవన్నీ కలుపుకుని సౌరకుటుంబం—అంటే సూర్యుడు ఆధారంగా మనుగడ సాగించే కుటుంబం సూర్యుడు ఒక నక్షత్రం. ఇటువంటి నక్షత్రాలు 10 వేల కోట్లు ఉన్నాయి అది ఒక కుటుంబం. దానిని గాలక్సీ అంటారు. మన గాలక్సీని మిల్కీవే (పాలపుంత)) అంటారు. ఇట్లా గాలక్సీలు కొన్ని లక్షలతో కూడినది ఈ మహా విశ్వ.

ఇదీ విశ్వరూపం. అయితే ఈ విశ్వం ఎప్పుడు, ఎలా సృష్టింప బడినది ?

విశ్వసృష్టి గురించి మహా విస్ఫోటనం లేదా పెద్ద పేలుడు సిద్ధాంతం (బిగ్ బాంగ్ థియరీ వివరిస్తున్నది. దీని ప్రకారం దాదాపు వేయికోట్ల సంవత్సరాల క్రితం విశ్వంలోని పదార్థమంతా ఒకచోటకుదించుకు పోయే ఉంది అదిఆదికాలపు బ్రహ్మాణువు ప్రిమివల్ ఆటం అది ఎంతగాకుదించుపోయింది అంటే ఒక టీ స్పూన్ పదార్థం కొన్ని కోట్ల టన్నులబరువు తూగి ఉంటుం ఇక ఉష్ణోగ్రత గురించి ఆలోచిస్తే 1500 కోట్ల డిగ్రీల స్థాయికి చేరి ఉంటుంది పీడనం కూడా బాగా పెరిగి ఉంటుంది ఆ అధికాధిక ఉష్ణోగ్రత పీడనాలకు తట్టుకోలేక బ్రహ్మాణువు బద్ధలైంది అదే పెద్ద పేలుడు

అలా విస్ఫోటనం చెందిన పదార్థం నాలుగు దిక్కులకు అమితమైన వేగంతో విరజిమ్మబడింది ఆపదార్థం ప్రాథమిక కణాలుగానూ, శక్తిగానూ ఉండి, ఖండ ఖండాలుగా విస్తరించసాగింది అంతేకాదు. పదార్థం శక్తిగానూ శక్తి పదార్థంగానూ పరస్పరం మారుతూ విస్తరించసాగింది. ఆవిస్తరణలో

ముందు హైడ్రోజన్ హీలియం, నైట్రోజన్, ఆక్సిజన్ మొదలైన తేలిక మూలకాలు, తదుపరి వాటిమధ్య గురుత్వాకర్షణ ఏర్పడటంవలన నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు మొదలైన గోళాలుగా రూపొందాయి.

ఇలా విశ్వసృష్టి జరిగిందని ఆధునిక శాస్త్రవేత్తల ప్రగాఢ విశ్వాసం దానికి రుజువులూ లభించాయి. దీనిని బట్టి అర్థమయేది వేయికోట్ల సంవత్స రాల క్రితం బ్రహ్మాణువు ఒకటి ఉన్నది. అదే ఇప్పుడు ఇన్నిగా మారింది.

ఇప్పుడు సృష్టిని గురించి అమ్మ చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చు కోండి సృష్టి అనాది అన్నది అమ్మ అవును సృష్టి ఎప్పటిదని చెప్పగలరా ? 1000 కోట్ల సంవత్సరాలక్రితం మహా విస్ఫోటనంతో ప్రారంభమై ఇప్పటికీ విస్తరణ చెందుతున్న ఈ మహావిశ్వం అంతకు ముందు ఎన్నిసార్లు ఇలా విస్ఫోటనానికిలోనైందో? అంటే అమ్మ చెప్పినట్లుగా సృష్టి అనాది అనేగా అర్థం

అంతేకాక అమ్మ 'ఆది' అనే పదానికి కొత్త నిర్వచనం ఇచ్చింది "ఆది అంటే మొదలనే కాదు, ఉన్నదే" అని నిర్వచనం

ఆది అంటే సామాన్యంగా మనం అర్థంచేసుకొనేది మొదలనే కాని అమ్మ ఆది అంటే మొదలనేకాదు, ఇప్పుడు ఉన్నదికూడా అదే అంటారు. అమ్మ ఇచ్చిన ఈ నిర్వచనంలో వినూతనమేకాక, విశ్వజనీనతకూడా చోటు చేసుకుంది.

అదెలాగూ అంటే —

మీ స్నేహితుడు కొత్తగా ఇల్లుకట్టుకుని గృహప్రవేశానికి మిమల్ని ఆహ్వానించాడు. వెలుపలినుంచి ఇల్లు చూడముచ్చటగా ఉంది. లోపల చూస్తే సకల సౌకర్యాలూ సమకూర్చి ఉన్నాయి. అతని ప్రయోజకత్వాన్ని ప్రశం

సిస్తూ "ఇల్లు ఎప్పుడు మొదలు పెట్టావు ?" అని అడిగితే, శంకు స్థాపన చేసిన సుమూహూర్తం చెప్పి, అదీ ఇంటికి మొదలు అంటాడు. అంతవరకు అసమాధానం బాగానే ఉంది.

మీకు అలా చక్కగా ఇల్లుకట్టు కోవాలనిపించి "ఇల్లు కట్టడం ఎలా మొదలు పెట్టావు ? అసలు అది ఏమిటి ? అని తరచి అడిగితే, రెండు నిమిషాలు ఆలోచించి, గతం గుర్తుకు తెచ్చుకుని, శంకు స్థాపన రోజున ఉపయోగించిన - పునాదిరాయి, గమేళా సున్నంతో కట్టుబడి ప్రారంభమయింది అదే ఈ ఇంటికి ఆది అంటాడు.

అయితే కేవలం ఒక పునాదిరాయి, ఒక గమేళా సున్నంతో ఇంత ఇంటి నిర్మాణం జరిగిందా ? కొన్ని టన్నుల ఉక్కు, కొన్ని వందల కట్టల సిమెంటు, కొన్నివేల ఇటుక, కొన్ని లారీల ఇసుక, కొన్ని లారీల కంకర, కొన్నివేల రూపాయల కలప - ఇలా ఎంతో పదార్థంతో, నిర్మాణం జరిగితేనే ఈ ఆకారంలో ఇల్లు తయారయింది.

కాబట్టి ఈ ఇంటికి ఆది ఏమిటి అంటే, ఈ ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థం అంతా అనేకదా? అయితే పదార్థం ఇప్పుడు మొదట్లో ఉన్న రూపంలో లేదు. ఇంటి రూపంలో ఉన్నది కాని అప్పుడు ఆరంభంలో ఉన్నదే ఇప్పుడు ఉన్నది. అందుకనే ఆది అంటే మొదలేకాదు, ఉన్నదే అంటుంది అమ్మ

ఇలా ఒక గృహానికి అన్వయించిన ఈ భావాన్ని మహావిశ్వానికి అనువర్తింపజేయవచ్చు. విశ్వానికి ఆది ఏమిటి ? అని ప్రశ్నిస్తే మహా విస్ఫోటనం జరగకముందు పెద్దముద్దగా ఉన్న బ్రహ్మాణువు అని చెప్తే సరిపోదూ ? సరిపోతుంది.

కాని ఇప్పుడు భూమిమీద చూస్తున్న బల్లా, కుర్చీ, చీమా, దోమా మొదలైన సకల చరా చరాలు, ఆకాశంలో జూస్తున్న నక్షత్రాలు గ్రహాలు

మొదలైన గోళాలు - ఆ బ్రహ్మాణువు యొక్క రూపాంతరమే కదా ? కాబట్టి విశ్వానికి ఆది ఇప్పుడు ఉన్న ఈ సర్వజగత్తు అని చెప్పినా సరి పోతుంది. అందుకే అమ్మ - ఆది అంటే మొదలనే కాదు, ఉన్నదే - అంటుంది.

ఒక సోదరుడు అమ్మను అడిగాడు-సృష్టి ఎందుకు ఏర్పడింది ? అని

"నిప్పు ఎందుకు కాలుతుంది నాన్నా ?" అని అమ్మ ప్రశ్నించింది.

దాని స్వభావం అది - సోదరుని సమాధానం

ఇదీ అంతే నాన్నా - అమ్మ ప్రవచనం

సృష్టి ఏర్పడటానికి కారణం - దాని స్వభావమే అంటుంది. అమ్మ

"దైవం సృష్టి చేయటం కాదు, దైవమే సృష్టిగామారింది అదేఇన్ని రూపాలుగా వచ్చింది. ఇదంతా అదే భగవంతుడు - అన్నది మీరు పెట్టిన పేరు భగవంతునికి స్త్రీ, పురుష, భేదంలేదు. దానికి భగవంతుడని కాదు, ఏపేరైనా పెట్టు ఉన్నది ఒకటి దాని సైన్స్ శక్తి అంటే ఆధ్యాత్మికం దైవం అంటున్నది." - అని అమ్మ దైవం గురించి కుండ బద్దలు కొట్టినట్లు చెప్పింది.

సృష్టికర్త వేరేఒకడు ఉండి సృష్టి చేయటం కాదు, సృష్టితోనే సృష్టి అయింది ఆ ఉన్నదే ఇన్నిగా మారింది కాబట్టి ఈ కన్పించేదంతా దైవమే

సృష్టియొక్క ఈ విరాట్ స్వరూపానికి, సృష్టిలోని వైవిధ్యానికి అచ్చెరువొందిన ఒకసోదరుడు - చివరకు ఇదంతా ఏమవుతుందమ్మా ? అని అడిగితే అమ్మ ఏం సమాధానం చెప్పిందో చూశారా ?

"దేనికి చివర ? ఎక్కడికి చివర ? సృష్టికి ఆద్యంతాలు లేవు" అని నిష్కర్షగా చెప్పింది.

అవును - దేనికి చివర ? ఎక్కడికి చివర ? దేనికి మొదలు ? ఏది మొదలు ? ఇంతకు ముందు ప్రస్తావించినట్లుగా సైన్సు ప్రకారం మహా విస్ఫోటనం జరగటంతో విశ్వ విస్తరణ ప్రారంభమవుతుంది ఆలా కొన్ని వేల కోట్ల సంవత్సరాలపాటు సాగుతుంది. తిరిగి గురుత్వాకర్షణవలన ముకు ళించుకుంటుంది. బ్రహ్మాణువు ఏర్పడుతుంది ఉష్ణోగ్రతా పీడనాలు అధికాధి కంగా పెరుగుతాయి. మళ్ళీ ప్రేలుడు జరుగుతుంది. మానవహృదయంలాగా విశ్వపదార్థంకూడా స్పందనకు లోనవుతున్నది. అయితే ఈ విశ్వస్పందనకు ఆది ఏమిటి ? అంతం ఎక్కడ ? అనంతంగా సాగేదే ఈ స్పందన అందుకే అమ్మ - సృష్టికి ఆద్యంతాలు లేవు అనీ, సృష్టికి రూపాంతరం తప్ప నాశ నం లేదు - అనీ అంటుంది

అమ్మ అంటే ఏమిటో కూడా చక్కగా నిర్వచించటం జరిగింది. "దేనికైతే ఆది అంతమూ లేదో, ఏది సర్వానికి ఆదిఅంతమూ అదే అమ్మ అమ్మ అంటే తల్లి, తల్లి అంటే తొలి"

ఆది అంతమూ లేనిదిఏమిటి ! ఈ సృష్టేకదా ! కాబట్టి సృష్టేఅమ్మ ఈ జగత్తే అమ్మ

"జగజ్జనని" అన్న పదానికి అర్థంచెప్తూకూడా - జగజ్జనని అంటే జగత్తుకు జనని అని కాదు, జగత్తే జనని - అని వివరించటంలో ఉద్దేశం ఆదే

సర్వానికీ ఆదీ అంతమూ ఏది - అది అంటే అమ్మ నిర్వచనం ప్రకారం ఇప్పుడున్నదే కదా! ఇప్పుడున్నది - మారుతూ ఉన్న ఈ జగత్తే అలాగే అంతంలో ఉండేది ఏమిటి - ఈ జగత్తే! లేకపోతే రూపంలో తేడా ఉండవచ్చు కాబట్టి సర్వానికి ఆది, అంతమూ - జగత్తే ఆ జగత్తే అమ్మ

"సృష్టి అనాది" అనటమేకాక" సృష్టి నాది" అనీ అమ్మ ప్రకటించింది. ఈ ప్రకటన చేసిన అమ్మ హృదయ వైశాల్యం ఏ కొలబద్దకు అందుతుంది

రామకృష్ణ అన్నయ్య పలికినట్లుగా - ఈ ఊరునాది, ఈ రాష్ట్రం నాది, ఈదేశం నాది - అన్నవాళ్ళు ఉన్నారుకాని, "ఈ సృష్టినాది" అని ప్రకటించిన వాళ్ళు చరిత్రలో కన్పించరు సృష్టితో తాదాత్మ్యం చెందిన అమ్మకే సరి పోయింది ఆవిధంగా ప్రవచించటం

ఇలా సర్వమూ తానే అయిన అమ్మ దృష్టిలో ద్వంద్వం అంటూ లేదు కాగడా వేసి వెతికినా కనిపించదు.

ప్రజ్ఞానం బ్రహ్మయితే అజ్ఞానం ఎందుకు కాదు ?

అన్నం పరబ్రహ్మమయితే అశుద్ధం ఎందుకు కాదు?

శబ్దం బ్రహ్మయితే సైలెన్సూ బ్రహ్మే!

సర్వమూ బ్రహ్మే అన్నది అమ్మ వెలుగూ చీకటీ, మంచీ చెడు అంతా బ్రహ్మే అన్నది. కంటికి కన్పించే బల్లా, కుర్చీ, చీమా, దోమా మొదలైన చరా చరాలే కాదు, కన్పించని ఎక్స్ కిరణాలు, రేడియో తరంగాలు ఉష్ణశక్తి - అంతా బ్రహ్మ పదార్థమే

అన్ని ఆకారాలు - బల్లా, కుర్చీ పక్షీ, జంతువూ, మీరూనేనూ - వాడివే కాబట్టి నిరాకారుడు

అన్నిగుణాలూ - తీపీ, చేదూ వేడీ వెలుతురూ, విద్యుత్తూ, రేడియో వాడివే కాబట్టి నిర్గుణుడు

దైవం యొక్క నిరాకారత్వం, నిర్గుణత్వం, విస్లవాత్మకంగా నిర్వచించింది అమ్మ

ఒక్క మాటలో - కనించేదీ కన్పించనిది అది పదార్థంకావచ్చు, శక్తి కావచ్చు - సర్వమూ, ఈ ఉన్నదంతా అదే, దైవమే

# నమస్సుమాంజలి !

—కొండముది వెంకట చలపతిరావు

---

అర్క పురీ వరవాసిని
అందరికీ జనని
అల్పాక్షర అనల్పార్థ
ఆగమోక్త వచస్వినీ
రాగ సుధా స్రోతస్వినీ
మేగమున్న మనస్వినీ!
అమ్మ నీనే మహిత మధుర
అక్షర పదదసినీ!
అందుకొను మన మనస్సులు
అరవిరిసిన సుమనస్సులు

అర్క పురమందు వసియించు నామె ప్రతిభ
బాల్యమ్మాగ వికసించి ప్రభలు జిమ్మె
అన్నదాన వ్రతాసక్తమామె (మూర్తి) యెడద
అవనిక అతటి కమ్మమైయవతరిల్లె

నిత్య కళ్యాణ సంస్తుత్యమౌ నిలయమ్ము
అమ్మ విలసెల్లెడు నాలయమ్ము
ఆటంకమెరుగని అన్నదాననిధాన
మమ్మ విలసిల్లెడు నాలయమ్ము

కవిదిగ్గజమ్ముల కావ్యాది వాసంబు
అమ్మ విలసిల్లెడు నాలయమ్ము
భక్త సంతతి భవ్య భావనా నిలయమ్ము
అమ్మ విలసిల్లెడు నాలయమ్ము

క్రమ గతుల నుతి యించు గాయకులతో
బోధకులు సాధకులు సమారాధకులతో
అలరు చుండును అమ్మ ప్రేమాలయమ్ము
అందగించును అమ్మ మహిమాలయమ్ము

మలయా చలవాస మహితమైవీతెంచు
ప్రత్యూషపవనాలు ప్రబలు వేళ
నిబిడాంధ నీరవ నిశికి భరతమ్మలా
పక్షులు కలరువాలో పలుకువేళ
గాఢసుప్తినివీడి కనువిప్పి జీవులు
చైతన్య జగతికి జనెడి సాగువేళ
అరుణాంశుతతి వరలు నాదిత్య బింబమ్ము
పూర్వాద్రి వెల్గులు పూయువేళ

తూర్యరవముల మాదుర్యదుర్యమెసగ
హాసరేఖలు ప్రసరించి భాసమాన
పీఠికాసీనమై తన బిడ్డలిడెడి
పూజలందెడునమ్మ సంపూత చరిత

నిండుగా సర్వ దేడులు నిండుకతన
పండుగను జరుపుకొనుచుండె భక్త వితతి
అమ్మషష్టబ్ధి యుత్సవమఖిల జనుల
నేత్ర పర్వమ్ము ధాత్రికి నిడు శుభమ్ము

# శ్రీచరణ సందర్శనం

కొండపలుది దత్తాత్రేయశర్మ

పసిపాపల నవ్వుల వెన్నెలలో
విరిసిన తెలిమల్లెల చల్లదనం
వికసిత నందనవన పారిజాతాల
పరిమళభరిత దివ్య సంస్కార సౌరభం

అమ్మా ! నీలో వీటిని వీక్షిస్తున్నాను !
ఆ అనుభూతిని మదిలో పదిలపరుస్తున్నాను !!
నా ఆనందాన్ని పదిమందిలో ప్రకటిస్తున్నాను !!!

నాలుగుప్రక్కలా అంటుకున్న
మహారణ్య మధ్యంలో
ఓంటరిగా చిక్కిన
నమషునిలాగా....
చుట్టూరా ఆవరించిన
అంధకారంలో
శోక హృదయంతో నిల్చిన
సుమోధనుడిలాగా
అధికార ఇనుప పంజరంలో ఇరుక్కు
పోయిన వృద్ధ ఇంద్ర శార్దూలంలాగా....

నిలిచి చికాకుల కీకారణ్యంలో
చింతలతో వంతలతో
పయనిస్తున్న నిరంతర పథికుడు !!
మానసిక అశాంతికి మరో పేరని!!!
"తృష్ణజాస్తి: తృప్తి నాస్తి
—ఇదే మా సిద్ధాంతం

అయినా పయనం సాగుతోంది
శూన్యంలోకి, అంధకారంలోకి....
ఈ:దారి కన్పించని బాటసారికి
వెలుగుదివ్వెనీ చల్లని పల్లె !!
అజాత శత్రువు మా రామకృష్ణ అన్నకు మల్లె!!

అమ్మా ! నీవు నిల్చినచోటు దివ్య సౌందర్య సీమ
నీవు పిల్చిన పిలుపు ముల్లోకాల గెలుపు
నీ అమృత కరస్పర్శ
కావాలి మాకు నిరంతర శ్రీరామరక్ష
నీ మమతల నీడలో
నిలవాలని వేడుకుంటున్నాము భిక్ష
సత్యం, సత్సంగం, సమభావం,
అనురాగం, అభిమానం, ఆదరణ
....ఈ: పునాదులు నీ భాష్యాలు
సత్య శివంకరమూ, సుందర శుభంకరమూ

....నీ దివ్య భవ్య సందర్శనం
మనశ్శాంతికి మందిరం
....నీ శ్రీచరణాల సన్నిధానం
అమ్మా ! దయా జాలీ కరుణా
మా అంతరంగాలలో నిండాలనీ....
సదవగాహన, సంయమనం. సౌజన్యం
మాలో వెల్లి విరియాలనీ....
ఆశీర్వదించు! మాలో మంచిని పెంపొందించు....
మమ్మల్ని మనుషులుగా రూపొందించు
అందుకే అందిస్తున్నా నాభావాల మందారమాల !
వికసిత సుమదళాల హేల !!

—:O:—

# అనిర్వచనీయం అనుభవైక వేద్యం అమ్మ

కొండముది శ్రీరామచంద్రమూర్తి

బతకడానికి కూడూ, గుడ్డా, కావాలి,

మనసు పెరగటానికి అగ్నివర్షంలో తడవాలి.

బతుకుబాటలో మనవాళ్ళనునేవాళ్ళు పక్కన లేకపోతే అడుగు ముందుకు వేయలేం అందలంలో కూచున్నా ఆనందం అనుభవించలేం. అట్లాగే అగ్నివర్షలో తడుస్తున్నపుడు అయినవాళ్ళు గొడుగు పట్టకపోతే. అనుభవాల తాకిడికి శరీర పత్రం శీర్ణమై, హృదయ పుష్పం రేకులు వీడి, కర్మఫలం బలీయమై నేత్రతోయం ఇంకిపోతుంది.

ఆవిషంగా కాకుండా, స్నేహితుడూ బంధువూ, మనను కన్న వ్యక్తీ, మనం కనుగొన్న వ్యక్తీ అన్నీ తానేఅయి ఒక్కటిగా సాక్షాత్కరించి మనసు వాకిలి తట్టి, హృదయక్షేత్రం మెట్టి, దైవపీఠంమీద కూచుని, అమ్మగా అవతరించిన వ్యక్తిని. నిర్వచనాల చట్రంలో బిగించటం కన్నా. అమె అందించే అనుభవ క్షీరాన్ని తాగుతూ తల్లి-బిడ్డలుగా తనువులు తెల్లవాప్పుకోవడంలోనే సార్థకత ఉందేమో అనిపిస్తుందినాకు.

ప్రయాసపడి భారము మోయుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును అన్న క్రీస్తు సువార్తకు ఆమె పర్యాయపదం అయినా, సంఘం శరణం గచ్చామి అన్న అన్న త్రిపీటక సూక్తికి ఆమె జీవన విధానం ఒక నిదర్శనం అయినా, సర్వం ఖల్విదం బ్రహ్మ అన్న ఉపనిషత్ దర్శనానికి ఆమె ఉపదలయినా నాలుగు వేదాలు, జెండ్ ఎవెస్తా, ఖురానిషెరీఫ్, హోలీబైబిల్, బౌద్ధ బోధన, జైనవాణి, ఆదిగ్రంథం, అన్నీ చదివినవారికి అమ్మ బోధనలో ఒక విసూతనత్వం గోచరించినా అరకొరగా నేర్చినవారికి ఒకఅఖండత్వం వినిపించినా, ఏమీతెలియని నా బోంట్లకు మాత్రం అమ్మ అమ్మగానే కనిపిస్తున్నది.

అందుకనే నిర్వచనాల అరణ్యంలో దారితప్పటంకన్నా, కనిపించని ఆ దేవుడికి ప్రతిరూపంగా సంభావించటంకన్నా, అమ్మగా ఆమె అండన చేరడంలోనే మనకు భద్రతా, సుఖమూ ఉన్నాయనిపిస్తుంది నాకు.

అమ్మ మమతకు, మాధుర్యానికి, గుండెతీపికి, మధురోహకు, కన్నీటికి, నిరిసే నవ్వుకు ఈ సృష్టిలోని సమస్తమైన లాలిత్యానికి, సౌందర్యానికి ప్రతీక.

అంతమాత్రమేకాదు మనం కానిది తానేమీకాదు. మనకు కడుపు నిండనిది ఆమె కడుపు నిండదు. తొలినాటినుండి ఈ మాయా జగత్ దర్పణంలో మనను మనం చూసుకుంటూ మన రూపాలను మనం విశ్లేషించుకుంటుంటే జగత్ సిద్ధాంతావలోడనంలో తలలు బద్దలు కొట్టుకుంటుంటే, తానూ శతధావిస్తరిల్లుతూ, సహస్రార కమలంగా వికసిస్తూ నిత్యబాలింతగా తనను తాను ప్రకటించుకుంటూ, జగత్తే తానై, సంసా

రంలో వున్న సారాన్ని పంచి పెడుతూ, అందరికీ సుగతిని ప్రసాదించ గలనని అభయం ప్రకటిస్తున్నది అమ్మ.

ఆ అమ్మే అంటున్నది తనకు గుణ భేధం లేదని, కుల బేధం లేదని, శుక్ల శోణితాలకు ఏ కులమో ఆకులం మనదని ఆమెకు పూర్వ కర్మ లేదు. పూర్వ జన్మ లేదు. తనకు తానే గుర్తు చెప్పుకున్న గురువు, అక్కడ ఎవరికీ ఆదేశం లేదు. ఉపదేశం లేదు. అమె ఇంట్లో ఆకలి లేదు. అందరిల్లూ అది. ఆ వాకిట్లో అందరూ అక్కలే. అందరూఅన్నలే అది స్వర్గమా ? స్వర్గమంటే ఒక ఊహ. ఒక అందమైన కల్పన. అది వర్గరహితమైన ఒక నూతన సామాజిక వ్యవస్థ. బలహీనులకూ. దగా పడిన వాళ్ళకూ అమె వొడిలో వెచ్చదగం అనంతంగా లభిస్తుంది. మాతృత్వంలోని మాధుర్యం విచక్షణా రహితంగా, కట్టుబాట్లె తెలియని కట్టలనుదాటి నలుగుర్నీ వివసుల్ని చేస్తుంది.

అందుకనే అమ్మను అనిర్వచనీయం. అనుభవైక వేద్యం అంటు న్నాను. ఆమె బోధనలు అందుకొన్నవారికి అందినంత ఆమె మాతృ త్వం మాత్రం అందుకో లేని వా రి కీ కూడా ఆపుకోలేనంత జ్ఞాన చక్షువులో ఆమెను దర్శించాలనుకుంటే మదగజాన్ని అయిదుగురు గుడ్డి వాళ్లు అంచనావేసినట్లవుతుంది. భక్తితో, ప్రేమతో ఆమె పాదాలను స్పర్శిస్తే మనలోని వామనుడు త్రివిక్రముడవుతాడు,

అరవైఏళ్ళ అమ్మ శరీరానికా షష్టిపూర్తి పండుగ ? అనాది లేని అమృతత్వానికా ఈనాడు ప్రణవాంజలి ? నామటుకు నాకనిపిస్తుంది. మనిషి ఉండి మనుషులుండనట్లే. అమ్మతనం మిగిలి అమ్మరూపం తెర

మరుగౌతుందన్న భయంతో మనం ఇవ్వాళ సంబరంగ చేసుకుంటున్నాం. ఆ దివ్యమంగళ విగ్రహానికని ! అట్లా ఏం అనుకోనక్కరలేదు.

ఎప్పటివాడు ఆ రాముడు ? ఎంత ముసలివాడు ఆ కృష్ణుడు ? దశావతారాలేనాటివి ? క్రీస్తు, బుద్ధుడు, జొరాస్టరు, మహావీరుడు. రమణుడు, అరవిందుడు, వివేకానందుడు ఏరీ వారీనాడు ? లేరా ? లేకేం ? ఎక్కడ?

మన హృదయ మందిరాలలో, మన దివ్య భావనలలో, మన కామనలో, మన చేతనలో !

అట్లాగే అమ్మకూడా మనలో పదిలంగా ఉంటుంది. నిత్య సుమంగళిగా. జ్వలిత జ్వాలగా, ఒకానొక చిచ్ఛక్తి స్వరూపంగా.

మనం. మనకన్నవాళ్ళు, వాళ్ళ పిల్లలు వాళ్ళవాళ్ళ పిల్లలలో అందరిలోనూ అమ్మ పదిలంగా పందిరి వేసుకుని ఉంటుంది.

ఆ భావనే అనమాయ రక్ష మనకు.

అదే అమ్మ షష్టిపూర్తి మహోత్సవంనాడు మనకు కలగవలసిన జ్ఞానోదయం.

జిల్లెళ్ళమూడి "అమ్మ" షష్ట్యబ్దిపూర్తి

జన్మదిన సందర్భమున శుభాభివందనలతో

**భారతి కమ్మర్షియల్ అండ్ టైప్ ఇన్స్టిట్యూట్**

4/2, అరండల్ పేట, గుంటూరు-2.

కాట్రపాటి జానకిరామశర్మ

ప్రిన్సిపాల్.